క్లుప్తంగా

విద్యార్థి దశ చాలా కీలకం

- ఏసీపీ సతీశ్



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్: విద్యార్థి దశ చాలా కీలకమని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారు ఉన్నత స్థాయికి చేరుతారని ఏసీపీ సతీశ్ అన్నారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థినులకు మహిళ రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చెడు ఆలోచనలకు తావివ్వకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, షీటీమ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కథల పుస్తకాలు బహూకరణ



పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ రచయిత్రి డా.సిరి రాసిన 'మంచుఊయల' బాలల కథల పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలతోపాటు కథల పుస్తకాలు కూడా చదవాలన్నారు. కార్యక్రమంలో సుగుణ సాహితి కన్వీనర్ దుర్గయ్య, హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు రామస్వామి, శ్రీదేవి, సమ్మయ్య, కవిత, నరేశ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలువేసే మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని ఎంఈఓ దేశిరెడ్డి, పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులు సురేశ్ కుమార్‌కు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అమ్మ కమిటీ తదితర సంఘాలు వేర్వేరుగా సత్కారం చేశాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి సురేశ్‌కుమార్ నిరంతరం పరితపించే వ్యక్తి అని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్ షరీఫ్, కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి



వినతి పత్రం ఇస్తున్న ఉద్యమకారులు

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలను వెంటనే ఇప్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం డీఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కేసుల పాలైన ఉద్యమకారులను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.25 వేల ఫించన్, హెల్త్‌కార్డులు, పిల్లలకు ఉచిత విద్య కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్, ఉద్యమ కారులు సంజీవరెడ్డి, శ్రావణ్ కుమార్, అంకుషావలి, భాగ్యలక్ష్మి, ఎల్లవ్వ, సారయ్య తదితరులు ఉన్నారు.

ప్రతి గీత కార్మిక కుటుంబానికి బీజేపీ సభ్యత్వం

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలోని ప్రతి గీత కార్మిక కుటుంబానికి బీజేపీ సభ్యత్వం అందజేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమాల ఆనంద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సభ్యత్వాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని దుకాణ సముదాయాలలో కొందరికి సభ్యత్వాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమారాణి, లక్ష్మారెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్యా.. జర దేఖో!

- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ఎనిమిదేళ్లు దాటినా మారని పరిస్థితి
- అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

అధికారులు ప్రజలకు చేరువలో ఉండాలని, పాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కాని ఆయాశాఖల కార్యాలయాల నిర్వహణను మాత్రం గాలికి వదిలేసిందనే విమర్శలు వస్తున్నాయి. అక్కన్నపేట మండల కేంద్రంగా ఏర్పాటై దాదాపుగా ఎనిమిదేళ్లు దాటినా ప్రభుత్వ కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగడం అందుకు నిదర్శనం. మంత్రి పొన్నం మండలం వైపు దృష్టి సారించాని స్థానికులు కోరుతున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంగా ఏర్పాటై ఎనిమిదేళ్లు దాటినా తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేయించి అందులో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎంపీ డీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరి చిన్నపాటి వర్షం వస్తే చాలు అంతా ఊరుతోంది. ఇరుకు గదుల మధ్య కార్యాలయాలను నెట్టుకొస్తున్నామని అధికారులు వాపోతున్నారు. ప్రజాపాలన, అలాగే ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక దరఖాస్తులను భద్రపరచడానికి గదులు లేక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ, పంచాయతీరాజ్‌లతో పాటు పలు ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేయలేకపోయారు. అదేవిధంగా గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు భవనాలు లేక హుస్నాబాద్‌లో కొనసాగుతున్నాయి.

స్థల పరిశీలన

మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ పక్కన సర్వే నెంబర్ 387లో సుమారుగా 5ఎకరాల్లో సమీకృత కార్యాలయాల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో స్థల పరిశీలన చేశారు. నిధులు మంజూరుకాక కార్యాలయాల నిర్మాణానికి అడుగులు పడలేదు.

త్వరగా సొంత భవనాలు నిర్మించాలి



త్వరగా సొంత భవనాల నిర్మాణానికి కృషి చేయాలి. అద్దె ఇళ్లల్లో కార్యాలయాలను నిర్వహించలేక అధికారులు అవస్థలు పడుతున్నారు. అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. సమీకృత భవనాల నిర్మాణానికి గతంలోనే స్థల పరిశీలన జరిగింది. భవనం అందుబాటులో లేక గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాల హుస్నాబాద్‌లో కొనసాగుతోంది.

– పెసరు సాంబరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు

భగీరథ పైప్‌లైన్ల లీకేజీలు ఉండొద్దు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసాచారి



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

కొండపాక(గజ్వేల్): మిషన్ భగీరథ నీటి సరఫరా పైపులైన్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసాచారి సిబ్బందికి సూచించారు. స్థానిక ఐటీసీ కార్యాలయంలో తాగు నీటి సరఫరా సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛమైన నీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టిందన్నారు. పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడడంతో నీరు కలుషితం అవుతుందని, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని వాపోయారు. ఓవర్ హెడ్ ట్యాంకులను తరుచూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా తాగునీరు సరఫరా అయ్యేలా చూసుకోవాలని, ఇబ్బందులు ఏర్పడితే పంచాయతీ కార్యదర్శి, సరఫరా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భూపతి, సూపరింటెండెంటట్ రాంప్రసాద్, నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ'సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లిలో 2009–10 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. వారు చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. ఉపాధ్యాయులు మల్లేశం, లక్ష్మణ్, గౌరీశంకర్‌శర్మ, నర్సింహులు, సుధాకర్, శ్రీనివాస్, బాలకిషన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేడ్కర్, విక్టరీ, నర్సాపూర్, బీజేఆర్ చౌరస్తాలతోపాటు పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 72 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా రూ.87,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల వాహనాల తనిఖీ చేపట్టగా 13మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని సోమవారం జడ్జి సౌమ్య ఎదుట హాజరుపర్చగా వారికి రూ.26వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని నాగసముద్రాల గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో గంటల ప్రతిపాదికన బోధించేందుకు పీజీటీ తెలుగు, టీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు 25వ తేదీ లోపు సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలల్లో సంప్రందించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఫ్యాక్షన్ పాలన: మాజీ ఎమ్మెల్యే**

హుస్నాబాద్: ఇందిరమ్మ పాలనను తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రాయలసీమ ఫ్యాక్షన్‌ను తలదన్నేలా పాలన కొనసాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండించారు. తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

◆ **విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదా ఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో సోమవారం చోటు చేసుకుంది. పొలాల్లో కంచెలేని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద మేత మేస్తున్న తన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామానికి చెందిన బాధితుడు అంజయ్య చెప్పా డు. దాని విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

◆ **సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలి**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామేశ్వరంపల్లిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టాల గురించి ఎస్ఐ హరీశ్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే**

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సీనియర్స్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లెక్చరర్లు మధుసూదన్‌రెడ్డి, మోహన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ శివారులోని మోయతుమ్మెద వాగులో పోలీసులు మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా గ్రామ శివారు నుంచి మూడు ట్రాక్టర్‌లలో ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొమురయ్య, పీసీలు రమేశ్, తిరుపతి పట్టుకున్నారు. బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్లు రవీందర్, సంజీవ్, సంతోష్‌పై కానిస్టేబుల్ కొమురయ్య ఫిర్యాదు చేశారు.

◆ **హుండీ ఆదాయం లెక్కింపు**

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రం శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం అధికారుల సమక్షంలో లెక్కించారు. మార్చి 20 నుంచి సెప్టెంబర్ 23వరకు 185 రోజులకు సంబంధించిన ఆదాయం రూ.1,80,534 లను భక్తులు సమర్పించుకున్నారు. ఆ నగదును ఆలయ బ్యాంకు అకౌంట్లో జమ చేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకుడు రంగారావు, మాజీ చైర్మన్, మాజీ ధర్మకర్తలు, సేవా సమితి సభ్యులు, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **రూ.2లక్షల రుణమాఫీ చేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన పంట రుణమాఫీ హామీలో జాప్యం తగదన్నారు. ఇటీవల వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించి వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు.

◆ **ప్రతిభ ఆధారంగా ఎంపిక**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండస్థాయి స్కూల్ గేమ్స్ సోమవారంతో ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

◆ **రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నుంచి మహ్మదాపూర్ వరకు తారురోడ్డు నిర్మాణం కోసం ఏడు నెలల కిందట శంకుస్థాపన చేసినా నేటి వరకు పనులు ప్రారంభం కాలేదని మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మహ్మదాపూర్ రోడ్డును పరిశీలించారు. గుంతల రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వారి వెంట సునీత, లక్ష్మణ్ ఉన్నారు.



ప్రతిభను గుర్తించడానికి క్రీడలు దోహదం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలను ఆయన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో ఆట తీరును ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, రాములు, నర్సింహులు, భైరయ్య, అంజిరెడ్డి, రాజేశ్, దేవరాజు, హెచ్ఎం రాజలింగం తదితరులు పాల్గొన్నారు. క్రీడోత్సవాలలో పాల్గొన్న ఆయనను పలువురు గ్రామస్తులు కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ముఖ్యంగా శివాజీ చౌరస్తాలో మురుగు కాలువల పరిస్థితి, వర్షాల కురిస్తే నిలిచిపోతున్న నీరు లాంటి వివిధ సమస్యల గురించి తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

అందరి భాగస్వామ్యం అవసరం



చెత్తను తొలగిస్తున్న రజిత తదితరులు

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: స్వచ్ఛత సాధించడానికి అందరి భాగస్వామ్యం అవసమని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆమె స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దని, పట్టణాన్ని స్వచ్ఛతలో ముందుంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ భాగ్యరెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

గజ్వేల్‌రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డు మార్గంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

సీఐటీయూ జిల్లా నేత భాస్కర్



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

దుబ్బాకటౌన్: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం దుబ్బాకలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 29రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టిందని మండిపడ్డారు. సమ్మెహక్కు, పని గంటలు, అక్రమ తొలగింపులు, మహిళా కార్మికుల హక్కులు, ఆరోగ్యం, సంక్షేమం తదితర ప్రాథమిక హక్కులకు నష్టం కల్గించే ఈ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పెన్షన్ దారులందరికీ కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజు, నగేశ్, మహేశ్, శ్రీలత, లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు తప్పనిసరి

– మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



అధికారులతో మాట్లాడుతున్న ఆశ్రిత్

సిద్దిపేటజోన్: ప్రతిరోజు తప్పనిసరిగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు జరగాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆదేశించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన స్థానిక చింతల్ చెరువును సందర్శించారు. అక్కడ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, స్వచ్ఛ సిద్దిపేటగా మార్చాలని కోరారు. అలాగే చెరువుకట్ట మీద పడిపోయిన రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు అన్వేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నాణ్యత లేని భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హుస్నాబాద్: వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో వార్డెన్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గుగులోతు లక్ష్మణ్ మండిపడ్డారు. మండల పరిధిలోని ఎస్టీ వసతి గృహాలను సోమవారం ఆయన సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతి నాయక్, అనిల్ నాయక్, దినేశ్, సురేశ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఛలో సంక్షేమ భవన్ ముట్టడికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ఉపాధ్యక్షుడు మరాటి కృష్ణమూర్తి, నాయకులు దుర్గయ్య, దాసు, బాలరాజు, వెంకటేశ్ తదితరులు బయలుదేరి వెళ్ళారు.

దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ అందించాలి

ప్రజావాణిలో దివ్యాంగుల వినతి

సిద్దిపేటరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం పెన్షన్‌ను రూ.6వేలకు పెంచి అందించాలని కోరుతూ దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలోని వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.4వేలు నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. అదేవిధంగా వృద్ధులు, వితంతువులు, చేనేత, బీడీ, గీత కార్మికులకు రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.